ప్రజాశక్తి
శనివారం 22 నవంబరు 2025
5
శ్రీకాకుళం




మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మార్చి 16వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎస్‌ఎస్‌సి బోర్డు షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న గణితం, 25న భౌతిక శాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఏప్రిల్ ఒకటో తేదీన సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 149 పరీక్షా కేంద్రాలను ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. పరీక్షలకు 28 వేల మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

ఆ నేతకు ఆగ్రహం వస్తే అంతే!

- ఆ పోస్టులో అధికారి రోజులు లెక్కపెట్టుకోవాల్సిందే
- పనితీరు బాగున్నా అధికారులకూ తప్పని బదిలీ వేటు
- కారణాలు లేకుండానే ఎపిసి శశిభూషణ్ ఆకస్మిక బదిలీ
- ఏ అధికారిని ఎప్పుడు సాగనంపుతారో తెలియని పరిస్థితి



విధి నిర్వహణలో అలక్ష్యం ప్రదర్శించడమో, అవినీతి ఆరోపణలపైనో గతంలో అధికారుల బదిలీలు జరిగేవి. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికార పార్టీ నేతలు కొత్త ఒరవడికి తెరతీశారు. తాము అడ్డగోలుగా సిఫార్సు చేసిన వాటిని అమలు చేయకున్నా, బదిలీ వేటు వేస్తున్న పరిస్థితి నెలకొంది. చివరకు తమను నెల నెలా కలవకపోయినా ఆ పోస్టు నుంచి అర్థాంతంగా తొలగిస్తున్నారు. తాజాగా సమగ్ర శిక్ష అడిషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శశిభూషణ్ బదిలీయే అందుకు నిదర్శనం. జిల్లాలోని అధికారుల్లో ఉత్తమ అధికారిగా ఉన్నతాధికారుల వద్ద గుర్తింపు పొందిన ఆయన్ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై ఉపాధ్యాయుల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఏ అధికారికి ఎప్పుడు స్థాన చలనం కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాకు చెందిన కీలక నేత ఆగ్రహానికి గురైతే, ఆ అధికారి ఆ పోస్టులో ఎన్ని రోజులు ఉంటారో లెక్కపెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. అదే సందర్భంలో ఆయన అనుగ్రహిస్తే వేరే జిల్లాలో పనిచేస్తున్న అధికారికి సొంత జిల్లాకు వచ్చే భాగ్యం కలిగిస్తున్నారు. తాజాగా జరిగిన ఎపిసిల బదిలీల్లో అదే జరిగింది. జిల్లాలో ఇప్పటివరకు ఎపిసిగా పనిచేసిన శశిభూషణ్‌ను బదిలీ చేసి కాకినాడ ఎపిసిగా పనిచేస్తున్న పి.వేణుగోపాలరావును ఇక్కడ తీసుకురావడంలో అధికార పార్టీకి చెందిన కీలక నేత ప్రమేయం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎపిసి పోస్టులో శశిభూషణ్ కొనసాగడం ఇష్టం లేని కీలక నేత, ఆయనపై బదిలీ వేటు వేయడంలో తనవంతు పాత్ర పోషించారనే చర్చ నడుస్తోంది. ఎపిసి శశిభూషణ్ శాఖాపరంగా చేసిన తప్పిదాలు గానీ, అవినీతి ఆరోపణలు గానీ ఏమి లేకపోయినా బదిలీకి గురికావడంపై విద్యాశాఖలో తీవ్ర చర్చ సాగుతోంది. కెజిబివిలకు కూరగాయల సరఫరాకు సంబంధించి నాణ్యత విషయంలో కరినంగా వ్యవహరించడం వెండర్లకు మింగుడు పడలేదని తెలుస్తోంది. కెజిబివిలను నిరంతరం తనిఖీ చేయడం, విద్యాలయాలను గాడిలో పెట్టేందుకు చేసే విషయంలో కొంత దూకుడుగా వ్యవహరించడం నేతలకు, చివరకు సొంత శాఖలోని కొందరు సిబ్బందికి సైతం ఇబ్బందిగా పరిణమించినట్లు తెలిసింది. తమ నేతను కలవడానికి ఏం రావడం లేదంటూ కొద్ది వారాల కిందట కీలక నేత పేషీ నుంచి పర్సనల్ సెక్రటరీ ఫోన్ చేసినట్లు సమాచారం. ఆ తర్వాత కొద్ది రోజులకే ఎపిసిపై బదిలీ వేటు వేయడం గమనార్హం.

కీలక నేత ఆదేశాలకు తలొగ్గాల్సిందే...

అధికార పార్టీకి చెందిన కీలక నేత మాటే ఉత్తర్వులుగా జిల్లాలో అమలవుతున్నాయి. ఆయన నుంచి వచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాల్సిన పరిస్థితి నెలకొంది. అది నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా ఉన్నా, అమలు చేసి తీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అలా అమలు చేయని పక్షంలో బదిలీకి సిద్ధమైపోవాల్సి ఉంటోందన్న చర్చ సాగుతోంది. జిల్లాలో విపరీతమైన రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయన్న సమాచారంతో జిల్లాకు బదిలీపై రావాల్సిన అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఉన్న అధికారులు సొంత జిల్లాకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నా, కొత్త అధికారులు మాత్రం రావడానికి ఇష్టపడడం లేదు.

జిల్లాకు రావడానికి ఇష్టపడని అధికారులు

గతేడాది జరిగిన డిఎంహెచ్ఒ బదిలీలే ఇందుకు ఉదాహరణ. జిల్లాకు కొత్త డిఎంహెచ్ఒగా విశాఖ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న డా.సుజాతను ఇక్కడకు బదిలీ చేస్తే వచ్చేందుకు అయిష్టత కనబరిచారు. దీంతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సిఎస్ఆర్ఎం (సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్)గా పనిచేస్తున్న డా.అనితకు డిఎంహెచ్ఒ బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది.

అధికారుల ఆత్మస్థైర్యానికి దెబ్బ

ఎపిసి శశిభూషణ్ బదిలీ ద్వారా అధికారుల్లోకి తప్పుడు సంకేతాలు పంపినట్లయిందన్న చర్చ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు గానీ, శాఖాపరంగా చేసిన తప్పిదాలు గానీ లేకున్నా వేటు వేయడం నిజాయితీగా పనిచేసే అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసినట్లయిందని అంతా అనుకుంటున్నారు. కీలక నేత ఆర్థికపరమైన ప్రయోజనాలు ఆశించి బదిలీ చేశారా?, ఏదైనా పని చెప్తే నిబంధనలకు విరుద్ధంగా ఉందని చేయడానికి శశిభూషణ్ నిరాకరించారా? అన్నది వారికే తెలియాలి. జిల్లాలో పనిపై నిబద్ధత, ఏదో చేయాలన్న తపన ఉన్న అధికారులు అరుదు. అటువంటి అధికారులనూ సాగనంపితే పాలనపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కీలక నేత తీరుతో టిడిపి కూటమి ప్రభుత్వానికే రాజకీయంగా నష్టం వాటిల్లనుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

త్వరలో రెండు హార్బర్లు

రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

త్వరలో జిల్లాకు రెండు కొత్త హార్బర్లు, జెట్టీలను తీసుకొస్తున్నామని రాష్ట్ర మత్స్య, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మూలపేట పోర్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉపాధి కోసం వెళ్లే వారిలో జిల్లా మత్స్యకారులు తప్పక ఉంటారని తెలిపారు. వారి సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులు పాత పద్ధతులు వదిలి సాంకేతికత వైపు వెళ్లాలని సూచించారు.

మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ జెట్టీలు, హార్బర్ల లేమి కారణంగా జిల్లాలో వలసలు ఉన్నాయని తెలిపారు. రాయితీ రుణాలు పొందేలా ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కువ మంది సొంత బోట్లు, వలలు కలిగి ఉంటేనే ఆర్థిక వృద్ధి సాధ్యమన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, జిల్లాలో 1.60 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పిఎం ఎస్ఎస్‌వై కింద దేవునల్తాడ, పిజి పేట గ్రామాలకు రూ.రెండు కోట్ల చొప్పున గ్రాంట్ వచ్చిందన్నారు. అంతకుముందు వేదిక ముందు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రి అధికారులతో కలిసి ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం చేపల వేటలో మృతి చెందిన జిల్లాకు చెందిన 31 మంది మత్స్యకార కుటుంబాలకు మంత్రి చెక్కులను అందించారు. పలు పథకాల కింద ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, పలు మత్స్యకార సొసైటీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు కండోనేషన్ ఫీజు

శ్రీకాకుళం సిటీ : పదో తరగతి పరీక్షలకు వయసు చాలని విద్యార్థులకు కండోనేషన్ ఫీజు చెల్లించడానికి విద్యార్థి వివరాలు నిర్ధారణ చేసి ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులకు ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్లు నిండని విద్యార్థులకు ఏజ్ కండోనేషన్ ఫీజు చెల్లించడానికి ప్రధానోపాధ్యాయులు https://ose.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ స్కూల్ లాగిన్‌లో లాగిన్ అయి విద్యార్థి వివరాలు ఓకే చేసి ఫీజు చెల్లించాలని సూచించారు. సిటిజన్ చలానా కట్టరాదని స్పష్టం చేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెలించడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.



పాఠశాల సముదాయాల్లో మార్పులు

- మండల కేంద్రాల్లో ఎస్‌ఎలకు
- ఎస్‌జిటిలకు క్లస్టర్ సముదాయాల్లో

ప్రజాశక్తి - టెక్కలి

పాఠశాలల సముదాయాల నిర్వహణపై విద్యాశాఖ మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఒకే క్లస్టర్ సముదాయాల్లో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొనేవారు. ఈ విధానాన్ని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వ్యతిరేకించారు. దీంతో విద్యాశాఖ పాఠశాలల సముదాయాల నిర్వహణపై కొత్త నిర్ణయం తీసుకుంది. ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.ఎ ఉపాధ్యాయులు క్లస్టర్ సముదాయాలకు హాజరు కాకుండా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో హాజరు కానున్నారు. దీంతో మండలంలోని పలు ఉన్నత పాఠశాలలకు చెందిన సబ్జెక్టు ఉపాధ్యాయులంతా ఒకేచోట కలుసుకునేందుకు వీలు కలిగినట్లయింది. ఎస్‌జిటిలు క్లస్టర్ సముదాయాలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈనెల 22వ తేదీన నిర్వహించే సముదాయాల్లో వీడియో లింక్‌లు ఉండకుండా ఉపాధ్యాయులే నేరుగా సబ్జెక్టు విషయాలపై చర్చించుకునేందుకు వీలుగా సముదాయాల్లో ప్రణాళిక రూపొందించారు.

స్వాభిమాన్‌కు 11 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్వాభిమాన్ వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌కు 11 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, వికలాంగుల శాఖ ఇన్‌ఛార్జి ఎడి బి.శైలజ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడో శుక్రవారం స్వాభిమాన్ వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెన్షన్ల కోసం అర్జీలు పెట్టుకున్న అర్జీదారులకు అర్హతలు ఉన్న వారికి సత్వరమే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్‌కు 11 అర్జీలు రాగా అందులో హౌసింగ్‌కు సంబంధించినవి మూడు, పెన్షన్ మంజూరు కోరుతూ రెండు, ఉద్యోగావకాశం కల్పించాలని కోరుతూ రెండు, సదరం సర్టిఫికెట్ కోసం రెండు, విద్యాశాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చింది. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖలు అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

కొత్త రైల్వేస్టేషన్‌కు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కవిటి, ఇచ్ఛాపురం

కవిటి మండలంలోని పెద్ద కొజ్జీరియా (గుడ్డిభద్ర) వద్ద కొత్త రైల్వేస్టేషన్, పాసింజర్ హాల్టుల కోసం ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు శుక్రవారం పరిశీలన చేపట్టారు. ఖుర్దా డివిజన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, జెఇ మహంతి పరిశీలించి ప్లాట్‌ఫారాల నిర్మాణంపై నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఒడిశా-ఆంధ్ర సరిహద్దు గ్రామాలకు రైలు సౌకర్యం కల్పించేందుకు ఒడిశా రాష్ట్రం చీకిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన సామంతరాయ్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సిఫార్సుల మేరకు ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్ఆర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌళో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఖుర్దా డివిజన్ రైల్వే అధికారులు

జాబ్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- గ్రామ పంచాయతీల్లో నేడు గ్రామ సభలు
- డ్వామా పీడీ సుధాకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉపాధి హామీ జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22వ తేదీన ఒకేసారి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, మండల స్థాయి అధికారులు గ్రామ పంచాయతీల్లో గ్రామసభ ఏర్పాట్లకు అవసరమగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి శ్రామికులు గ్రామసభలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.



జాబ్‌కార్డు కోసం కొత్తగా దరఖాస్తులు వస్తే స్వీకరించి, మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి శ్రామికుల నుంచి పని కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇకవైసి ప్రాసెస్ కారణంగా డిలీట్ అయిన జాబ్ కార్డులు మళ్లీ పరిశీలించి అర్హులైతే వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆమెది హత్యే

మృతదేహం ఆచూకీ కనుగొన్న పోలీసులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం నౌపడ మూడు రోడ్ల కూడలి సమీపంలోని కచీరు ఫారం వద్ద గురువారం లభ్యమైన మహిళ మృతదేహం ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. టెక్కలి మండలం కొండభీంపురం గ్రామానికి చెందిన దాసరి బాలకృష్ణ భార్య దాసరి పుష్పలత (32)గా గుర్తించారు. టెక్కలి సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహానికి శుక్రవారం శవ పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన పుష్పలతకు కొండభీంపురం గ్రామానికి చెందిన బాలకృష్ణతో 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలికి వివాహేతర సంబంధం ఉందని భర్త అనుమానించడంతో పలుమార్లు భార్యాభర్తల మధ్య పెద్దమనుషుల సమక్షంలో తగాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆమె హత్యకు గురికావడంతో వివాహేతర సంబంధం కోణంలో అనుమానం వ్యక్తం చేస్తూ దర్యాప్తు చేస్తున్నామని నౌపడ పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



కార్గో ఎయిర్‌పోర్టు వద్దు

నల్లబ్యాడ్జీలతో రాంపురం గ్రామస్తుల నిరసన

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీ వరకు కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 18న పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహా ధర్నాపై నిర్బంధాన్ని నిరసిస్తూ పోరాట కమిటీ పిలుపు మేరకు మందస మండలం రాంపురం గ్రామస్తులు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం నిరసన తెలిపారు.

మెయిన్‌లో...



అశ్రు నయనాలతో అంతిమ వీడ్కోలు

స్వగ్రామంలో టెక్ శంకర్ అంత్యక్రియలు

మెయిన్‌లో...

పనిచేసే వారికే పదవులు

- పార్టీ బలోపేతమే లక్ష్యం
- గ్రామ కమిటీలను పూర్తి చేయాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్


ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇందులో భాగంగా పనిచేసే వాళ్లకే పార్టీ పదవులు, బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వైసిపి గ్రామ కమిటీలను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అన్ని అనుబంధ విభాగాలకు, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకువెళ్లామని చెప్పారు. భవిష్యత్‌లో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో అనుబంధ కమిటీలు బలంగా ఉండాలన్నారు. ప్రతి సమన్వయకర్త ప్రజల్లో ఉండాలని చెప్పారు. సూపర్ సిక్స్ వైఫల్యాలు నిరుద్యోగ భృతి, జాబ్ కేలండర్, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.1500 అందజేయడం వంటి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో వైసిపి జిల్లా ఇన్‌ఛార్జి కుంభా రవిబాబు, పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, నియోజకవర్గాల సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుమండి గ్రామానికి చెందిన బాపూజీ సుబుద్ధి, మిథున్ బెహరాను అరెస్టు చేసి, వారి నుంచి 7.160 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. బాపూజీ సుబుద్ధి, మిథున్ బెహర్ ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చినట్లు తెలిపారు. రెండో ప్లాట్ ఫారం సమీపంలో మట్టి రోడ్డు వద్ద గంజాయితో ఉండగా టౌన్ ఎస్ఐ ముకుందరావు పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుంద రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మంత్రి గారూ దయ చూపరూ...?



పాతపట్నం వెళ్లే రహదారి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నుంచి పాతపట్నం వెళ్లే దారిలో సీతాపురం రైల్వేగేటు సమీపంలో ఎస్‌సి కాలనీ వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు ప్రధానమైన టెక్కలి, పాతపట్నం రోడ్డు.. మరోవైపు నౌపడ - గుణుపూర్ బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం ఉంది. వీటికి తోడుగా బొరిగిపేట ప్రాంతంలోని గ్రానైట్ క్వారీల నుంచి నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే భారీ గ్రానైట్, పోర్టు వాహనాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా 2015 రోడ్డు పనులు చేపట్టారు. అయితే పేదల పాకలు ఉండడంతో రోడ్డు మలుపు అధికారులు వదలేశారు. ఈ జంక్షన్ వద్ద రోడ్డు పూర్తిగా ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడగా.. మరికొంతరు గాయపడ్డారు. గ్రామం నుంచి ఎవరైనా వాహనాలతో ఒక్కసారిగా రోడ్డుకు వచ్చేసరికి నలువైపుల నుంచి ఎటువంటి వాహనాలు వస్తున్నాయో తెలియని ప్రమాదకరమైన పరిస్థితి చోటు చేసుకుంటోంది. ఇదిలా ఉండగా భారీ వాహనాల వలన రోడ్డుకు ఆనుకుని పూరిపాకల్లో నివసిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగుతుందోని బిక్కుబిక్కుమంటున్నారు. మంత్రి దయ చూపి పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టి పాకలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి



సీతాపురం ఎస్‌సి కాలని పెద్ద ప్రమాదకరంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రైల్వేలైన్ ఉండడంతో ఒక్కోసారి గేట్లు వేసే సమయంలో రోడ్డుపై వాహనాలు భారీస్థాయిలో నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

- బెండి ఉదయ్‌కుమార్

అధికారులు స్పందించాలి



టెక్కలి-పాతపట్నం రూట్‌లో సీతాపురం ఎస్‌సి కాలనీ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నాం. ప్రమాదాలు జరగక మునుపే అధికారులు స్పందించాలి. రోడ్డుకు ఆనుకుని ఉన్న వారికి పునరావాసం కల్పించి సమస్యను పరిష్కరించే విధంగా ఆలోచన చేస్తే మంచిది.

- యండ ధనుంజయరావు



లావేరు : రోడ్లు, కాలువలు పరిశీలిస్తున్న డిపిఒ

స్వచ్ఛ గ్రామలే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రతీ పంచాయతీ పరిధిలోని ప్రతీ గ్రామం స్వచ్ఛ పంచాయతీలే లక్ష్యంగా తీర్చిదిద్దాలని డిపిఒ భారతీ సౌజన్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లావేరులో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం పరిధిలో థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ఎల్ఎస్‌డిపై మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ఒక్కరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిపిఒ మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి తప్పనిసరిగా చెత్తసేకరణ చేయాలని, వీధులు సక్రమంగా శుభ్ర పరచాలని, ఆ బాధ్యత గ్రీన్ అంబాసిడర్లుపైనే ఉందన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలన్నారు ప్రతీ ఇంట సమీపంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్య పడుతుందన్నారు. అనంతరం వస్త్రపురి కాలనీలో పరిసరాలను, కాలువలు, వీధిరోడ్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పేడాడ వెంకటరాజు, డిప్యూటీ ఎంపిడిఒ సాయి పద్మజ, ఎంఎటిలు ఎర్నేని జ్యోతి, శ్రీనివాస్, చెట్టు శంకర్, కార్యదర్శులు కెళ్ల రామకృష్ణ, దాలినాయుడు, రమణ, సుజాత, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని అన్ని పంచాయతీల నుంచి వచ్చిన క్లాప్‌మిత్రలు, కమ్యూనిటీ రిసోర్సు పర్సన్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ కె. ఫణీంద్ర కుమార్ తెలిపారు. చెత్తనుంచి కంపోర్టు తయారీ, వర్మీ కంపోస్టు తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని నడిసంద్ర గ్రామంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ క్లాప్ మిత్ర క్లాస్‌షెడ్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా పని చేయాలన్నారు. .కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి ప్రతినిధి, గిరిజన నాయకులు బైర్సింగ్ దినకర్, డైరెక్టర్ భాస్కర్ గౌడ్, బసవ పరమేష్ రెడ్డి, ఎపిఒ రవి, మండల అధికారులు, సెక్రటరీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: పరిశుభ్ర-హరిత గ్రామ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలోని అన్ని పల్లెల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని క్లాప్ మిత్రులంతా పాల్గొని చెత్త సేకరణ చేసి, గ్రామ పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, ఇంటి వద్ద నుంచే చెత్తను సక్రమంగా వర్గీకరించి సంపదశాలకు పంపే ప్రక్రియపై క్లాప్ మిత్రలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంపిడిఒ త్రినాథ్ మాట్లాడుతూ చెత్త సేకరణలో క్లాప్ మిత్రులు పాటించాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రమైన గ్రామం నిర్మాణంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎఒ శ్రీనివాస రెడ్డి, కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. షలంత్రి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ విధానాలపై సిబ్బందికి శిక్షణను అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, ఇఒపిఆర్‌డి రామారావు, సర్పంచ్ ప్రతినిధి అదపాక గౌరునాయుడు, మండల పరిషత్ ఇఒ ప్రసాద్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని నడసంద్ర గ్రామపంచాయతీ పరిధిలో క్లాప్స్ మిత్రలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, డిడిఒ అలివేలు మంగమ్మ, వెంకటరావు, డైరెక్టర్ భాస్కర్, గౌడో పరమేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

పోలాకి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని సంతలక్ష్మీపురంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, రోణంకి కృష్ణంనాయుడు, వెంకట అప్పల నాయుడు, బైరి భాస్కరరావు, సూరపు నారాయణ దాసు, సర్పంచ్ వై నీలవేణి, ఎంపిడిఒ జి రవికుమార్, డిప్యూటీ ఎంపిడిఒ పద్మావతి, ఎన్ వెంకునాయుడు పాల్గొన్నారు.



కవిటి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

మందస: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో థీమ్ 5లో భాగంగా పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ తిరుమల కుమార్, డిఆర్‌సి ఆనందరావు, కార్యదర్శులు, ఎంఆర్‌సి శ్రీనివాసరావు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్‌లు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక చెత్త సంపద కేంద్రం వద్ద ఎంపిడిఒ వి.నీరజ అధ్యక్షతన గ్రీన్ అంబాసిడర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఎఒబివిఆర్ ప్రసాద్, ఇఒ బి.సుదర్శనరావు, కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులతో 'థీమ్-5 క్లీన్, గ్రీన్ విలేజెస్' అనే అంశంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, డిప్యూటి ఎంపిడిఒ వెంకటరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం.శాంత కుమారి పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మితో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కిషోర్ బాబు

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- సోంపేట

డిసెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్ బాబు కోరారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ అడ్వకేట్ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అడ్వకేటు వీలైనన్ని ఎక్కువ కేసులను రిఫర్ చేయించుకొని కాంప్రమైజ్ చేయాలని, ఈ విషయాన్ని తమ దగ్గర ఉన్న కేసుల్లో కక్షిదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్. శైలేంద్ర, ఎం.సర్వేశ్వరరావు, నాయక్, కె.ప్రకాష్ బాబు, కె.వెంకటరావు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ సాఫ్ట్‌బాల్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఘనంగా జాతీయ సాఫ్ట్‌బాల్ దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యాలయంలో జాతీయ సాఫ్ట్ బాల్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో సాఫ్ట్‌బాల్ వేగంగా అభివద్ధి చెందుతుందన్నారు. క్రీడాకారుల కోసం త్వరలో సాఫ్ట్‌బాల్ క్రీడా పరికరాలను అందజేస్తానని హామీనిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి రమణ మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, పిఎసి చైర్మన్ కూన రవికుమార్ సహకారంతో రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అసోసియేషన్ నాయకులు మెట్ట తిరుపతి రావు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బి.వి రమణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

నరసన్నపేట: పట్టణంలో నెలకొంటున్న రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్ కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలో సుడా కార్యాలయంలో చైర్మన్ కొరికాన రవికుమార్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, భూ కబ్జాలు తదితర అంశాలపై నిశితంగా చర్చించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని కోసంగిపురం వద్ద శుక్రవారం నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీహరితో కలిసి మున్సిపల్ కమిషనర్ ఇ. శ్రీనివాసులు పరిశీలించారు. గృహ సముదాయంలో మౌలిక సదుపాయాల కల్పనకు రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, మంచినీటి సరఫరా మొదలగు విషయంలపై కమిషనర్ టిడ్కో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడ్కో అసిస్టెంట్ ఇంజనీర్ రమణ, మున్సిపల్ ఆర్ఐ అమర్, సిఎల్‌టిసి జగన్, సిఎంఎం మోహన్, సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న కన్నబాబు గాయత్రి

బదిలీ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జాడుపల్లి సచివాలయంలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను గ్రామ సర్పంచ్ జనపరెడ్డి గాయత్రి కన్నబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సచివాలయ సేవల్లో పారదర్శకత, ప్రజలకు సమయానుసారం సేవలందించడంలో సిబ్బంది చూపిన అంకిత భావం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎన్ని సోమేశ్వరరావు, సెక్రటరీ వనజాక్షి, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో కాలేజీల దగ్గర, జంక్షన్‌ల దగ్గర ఆకతాయిలుగా తిరుగుతున్న వారిని జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి ఆదేశాల మేరకు శుక్రవారం శక్తీ టీం వారిని పట్టుకొని స్టేషన్‌కి తీసుకువచ్చారు. ఎస్ఐ చిరంజీవి, ట్రైనీ ఎస్ఐ మోహిని వారికి కౌన్సెలింగ్ చేశారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా బైక్ నడిపినా, వావర్ స్పీడ్‌గా డ్రైవింగ్ చేసినా, బైక్ సైలెన్సర్ తీసి సౌండ్ పొల్యూషన్ చేస్తూ కాలేజ్‌లు, స్కూల్‌లు చుట్టూ తిరుగుతూ కనిపించినా కేసులు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు.



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ తదితరులు

రిజిస్ట్రేషన్‌కు తొలగిన అడ్డంకులు

పొందూరు: పొందూరు గ్రామ కంఠంలోని 163 సర్వే నంబర్‌లోని సుమారు 64.48 ఎకరాలను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో 22 సి నుంచి తొలగించడంతో ఎట్టకేలకు రిజిస్ట్రేషన్‌కు అడ్డంకులు తొలగాయని టిడిపి పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగ నాయకులు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ఆరేళ్లుగా పట్టణంలోని ప్రజలు, వ్యాపారులు తమ ఆర్థిక అవసరాలకు భూములు, స్థలాలు ఉన్నా అమ్ముకోలేని పరిస్థితుల్లో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామ కంఠంలోని 163 సర్వే నెంబర్‌లోని సుమారు 64.48 ఎకరాలు ఎండోమెంట్‌లో చేరగా, తరువాత కొన్నాళ్లకు 22సిలో చేరింది. దీంతో ఈ సర్వే నెంబర్‌లోని భూమి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో గ్రామస్తులు తమ అత్యవసరానికి అమ్ముకోలేక అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సర్వే నెంబర్‌ను 22సి నుంచి తొలగించాలంటూ గ్రామస్తులు ఎన్నోసార్లు గత వైసిపి నాయకులు చుట్టూ ఎన్నో పర్యాయాలు కలెక్టర్ కార్యాలయానికి తిరిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎండోమెంట్ ఉన్నతాధికారులకు ఆయన సమస్యను తెలియజేయడంతో స్పందించిన అధికారులు సర్వేనెంబర్ 163ను 22సి నుంచి తొలగిస్తూ కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వగా కలెక్టర్ కార్యాలయం నుంచి పొందూరు సబ్‌రిజిస్ట్రార్‌కు ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. రెండు రోజులు తరువాత గ్రామస్తులు తమ భూములు, స్థలాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చుని తెలిపారు. ఎంతో కాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో స్థానిక నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలను తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాగవంశం కార్పోరేషన్ డైరెక్టర్ అనకాపల్లి విజయలక్ష్మి, వార్డు సభ్యులు దండా మురళీ, ఆనెం పాపారావు, మాజీ ఎంపిటిసి కాలెపు శ్రీను, టిడిపి నాయకులు దండా రవి, కాలెపు శ్రీను, పి.రామకృష్ణ, బాల తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

శ్రీనివాసరావుకు అభినందన

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయంలో సీనియర్ ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు రాసిన ఆంగ్ల పరిశోధనాత్మక వ్యాసం 'అనాలిసిస్ ఆఫ్ ఆప్టిమల్ ఎక్స్పీరియన్స్ ఆఫ్ ఆనరాండ్స్ ప్రోటగోనిస్ట్స్'ను ప్రతిష్టాత్మక ఇటరేటివ్ అంతర్జాతీయ ప్రచురణ సంస్థ తన పుస్తకంలో ప్రచురించింది. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీ శ్రీనివాసరావును అభినందిచారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, ఇంగ్లీష్ విభాగతి డాక్టర్ నూకేశ్వరరావు, అధ్యాపకులు ఇస్సాయి రాజు, అధ్యాపకులు ఉన్నారు.

వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

శ్రీకాకుళం సిటీ: నగరంలోని జబ్బా వీధికి చెందిన వారణాసి ప్రశాంత్ గురువారం మద్యం సేవించి బైక్ నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డాడని ట్రాఫిక్ సిఐ రామారావు తెలిపారు. నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపేవారికి జైలు శిక్ష తప్పదన్నారు. వాహన చోదకులు తమ భద్రత కోసమే అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇచ్ఛాపురం: మహిళా సంఘాల సమస్యలు పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని 17వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్ అన్నారు. శుక్రవారం వార్డులో ఆదిత్య మహిళా యువజన సంఘ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విప్ డాక్టరు బెందాలం అశోక్ దృష్టికి తీసుకు వెళ్తానని సంతోష్ తెలిపారు. ఐబి రాము, సిఎంఎం భాస్కర రావు, ఆర్‌పి ప్రమీల, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని వినతి

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం శ్రీవెంకటేశ్వర కాలనీ ఆవరణలో ఆరో వార్డులో డబ్ల్యుఎంఇ చర్చి స్థలంలో పంచాయతీ అనుమతులు లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేయకుండా స్థలం యాజమానితో కుమ్మక్కై దౌర్జన్యంగా సెల్ నిర్మాణం చెపడుతున్నారని డిప్యూటీ తహశీల్దార్ నారాయణమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్, సెక్రటరీ జీవన్‌లకు కాలనీ వాసులు శుక్రవారం ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఆరోవార్డు పరిధిలోని శ్రీవెంకటేశ్వర కాలనీ జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణం ఆపించాలని డిమాండ్ చేశారు. జనావాసాల మధ్య నిర్మించడం వల్ల భవిష్యత్‌లో ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సెల్‌టవర్ల నుంచి వెలువడే రేడియో ఫ్రీక్వెన్సీ వలన ఆరోగ్య సమస్యలు వస్తాయనే భయాందోళనలో ప్రజలు ఉన్నారన్నారు. అధికారులు స్పందించి సెల్‌టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- సరుబుజ్జిలి



మృతుడు శ్రీధర్

మండలంలోని బప్పడాం గ్రామానికి చెందిన పేడాడ శ్రీధర్ (41) గురువారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు శ్రీధర్ గత కొంతకాలం నుంచి వివిధ నేరాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా గుర్తింపబడ్డాడు. అలాగే ఇటీవల తన స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. నేర చరిత్ర వలన తనతో పాటు తన తల్లికి సంఘంలో గౌరవం దక్కడం లేదని మనస్థాపం చెంది తన కుమారుడు రాత్రి సమయంలో ఇంటిలోని వేరొక గదిలో ఆత్మహత్యకు పాల్పడగా తాను కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించడం జరిగిందని తల్లి పేడాడ మణిమ్మ శుక్రవారం ఉదయం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసామన్నారు. అలాగే శ్రీకాకుళం నుంచి పోలీసు క్లూస్ టీం కూడా బప్పడాం గ్రామం చేరుకొని మృతదేహాన్ని పరిశీలించిన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో శవపంచనామ నిర్వహించి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ



మృతి చెందిన అప్పయ్య

మండలంలోని గుత్తావల్లి గ్రామానికి చెందిన ఇసుకల పాలెం అప్పయ్య (76) బుధవారం గడ్డిమందు తాగాడు. వెంటనే 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుమారుడు తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మాజీ క్రీడాకారుడు మృతి



చింజీవిరావు

రణస్థలం: జిల్లా కేంద్రానికి చెందిన రాష్ట్ర మాజీ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పాండవ చింజీవిరావు (71) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఆస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈయన యంగ్ బోయ్స్ అసోసియేషన్ స్టేట్ ఆంధ్రా టైగర్ కెప్టెన్ బూర రఘురాం బాస్కెట్ బాల్ టీంలో కీలకపాత్ర పోషించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కళింగ లేబరేటరీస్ నడిపే వారు. ఎంతోమంది పేద రోగులకు అతి తక్కువ ధరలకు టెస్టులు చేయడంతో పాటు, మరికొంత మంది రోగులకు ఉచితంగా లేబ్ టెస్టులు చేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. అలాగే జిల్లాలో కళింగ ల్యాబ్ చిరంజీవిరావు అంటే తెలియని వారుండరు. బాస్కెట్ బాల్ క్రీడలో ఎంతో మందికి శిక్షణ అందించి క్రీడాకారులను తయారు చేయడంతో పాటు, ల్యాబ్‌లో కూడా ఎంతో మంది యువకులకు ల్యాబ్ టెక్నీషియన్స్ కోర్స్ అందించి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆయన మృతికి క్రీడాకారులు, ల్యాబ్ టెక్నీషియన్స్, వైద్యులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వ్యక్తికి 10 రోజుల జైలుశిక్ష

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలోని దమ్మల వీధికి చెందిన పూక్కల జ్ఞానేశ్వరరావు మద్యం మత్తులో ఎన్‌టిఆర్ కాలనీ, కంపోస్ట్ కాలనీ ప్రాంతాల్లో ఈనెల 11న రాత్రి పది గంటలకు పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన

క్రైమ్ కార్నర్

కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిందితులకు జరిమానా

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పెద్దశాన, జీడిపేట గ్రామాలకు చెందిన అట్టాడ నాగరాజు, పసుపురెడ్డి నరేష్‌లకు టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ యు.మాధురి రూ.పదివేలు చొప్పున జరిమాన శుక్రవారం విధించినట్టు కోర్టు కార్యాలయం ప్రకటనలో విడుదల చేశారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో పట్టుబడ్డారని, ఈ కేసుకు సంబంధించి కోర్టులో హజరుపర్చగా జరిమాన విధించినట్టు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.



దగ్ధమైన కారు

కారు దగ్ధం

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం ఫైర్ స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి పైడిభీమవరం సమీపంలో జ్యూట్‌మిల్లు ఎదురుగా శుక్రవారం జరిగిన ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా మధురువాడకు చెందిన గౌరీశంకర్‌కు చెందిన కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే విశాఖపట్నం జిల్లా మధురువాడకు చెందిన గౌరీశంకర్ శుక్రవారం ఉదయం శ్రీకాకుళం వచ్చి పని చూసుకుని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం తిరుగు ప్రయాణంలో పైడిభీమవరం వచ్చేసరికి కారు ఇంజన్ నుంచి పొగలు రావడంతో కారు పక్కకు ఆపి దిగిపోయారు. మంటలు చెలరేగడంతో తక్షణమే స్థానికులు రణస్థలం ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఎస్‌ఎఫ్ఒ డి.హేమసుందరరావు సిబ్బంది తో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఎస్‌ఎఫ్ఒ తెలిపారు. అయితే కారులో ఒక్కరే ఉన్నారు. వెంటనే కారు దిగిపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు.



చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ

కవిటి: మండలంలోని మాణిక్యపురం పంచాయతీ పరిధిలోని రెండు 40 కెవి ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ జరిగింది. గురువారం రాత్రి ఈ చోరీ జరగ్గా ఉదయం గమనించిన స్థానికులు సర్పంచ్‌కు విషయం తెలియజేశారు. దీనిపై స్థానిక సర్పంచ్‌ను సంప్రదించగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న వస్తువులు పూర్తిగా చోరీ జరిగినట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం మండల విద్యుత్ శాఖ అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తే ఆయన అందుబాటులోకి రాలేదు. అయితే గతంలో కూడా మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ జరిగింది. దీనిపై అప్పటి వరకూ గుమ్మనంగా ఉన్న విద్యుత్ శాఖ అధికారులు ఓ విలేఖరి వివరణ కోరగా ఆగ మేఘాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు దాని వివరాలు వెల్లడి కాలేదు.

చెరుకు పంట దగ్ధం

బూర్జ: మండలం బొమ్మిక రోడ్డులోని పెద్దపేట పంచాయతీ పరిధిలోని మదనాపురంలో రైతు నెక్కింటి నాగేశ్వరరావు చెరుకుతోటలో ఏర్పడిన అగ్ని మంటలకు చెరుకుతోట దగ్ధమైంది. పక్కనున్న పొలంలో చెత్తను కాల్చేందుకు పెట్టిన మంటలు ఎగిరిపడడంతో నాగేశ్వరరావుకు చెందిన ఎకరా చెరుకు తోటలో వ్యాపించిన మంటలకు పంట మొత్తం ఆహుతైంది. పాలకొండ అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఎస్ఐ సర్వేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాలిపోయిన ఎకరం చెరుకు తోట సుమారు రూ.లక్షా 50 వేలు ఉంటుందని రైతు తెలిపాడు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- అరసవల్లి

గొంటివీధి నిరాశ్రయుల భవనంలో పేదలకు, పోలిపాడ్యమి సందర్భంగా ప్రభాకర్ కాలనీకి చెందిన సంఘ సేవకులు, విశ్రాంత ఆచార్యులు అరికతోట కనకరాజు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ప్రతిఒక్కరు నిరాశ్రాయులకు అన్నదానం చేస్తే మంచిదని కనకరాజు తెలిపారు. చలికాలం కావడంతో అవసరమైన దుప్పట్లు, ఇతర సామగ్రిని అందిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో చేయూత మేమున్నాం అధ్యక్షులు, షెల్టర్ నిర్వాహకులు వైశ్యరాజు వెంకట లక్ష్మి, నిరాశ్రయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లెప్రసీ కాలనీలో అన్నార్తులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. బూర్జ మండలం వైకుంఠపురానికి చెందిన పొందూరు సూరయ్య అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పొందూరు రాము, స్వప్న దంపతులు కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిన్ను ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది వృద్ధులు, వికలాంగులు, అనాధలకు ఆహారం పంపిణీ చేశారు. కృత్విక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) మాట్లాడుతూ ప్రతిఏడాది కృత్విక్ ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరాలు ఆపదలో ఉన్న కుటుంబాలకు నగదు సహాయం ఆహార పంపిణీలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బైరి రాము, లింగుబేరి ఆనంద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలోని కోదండరామస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీఏటా పోలిపాడ్యమి సందర్భంగా శివస్వాములు మాల విరమణను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. అనంతరం శివస్వాములు భజనలతో ఊరేగుతూ వందల మంది నిరుపేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక సామూహిక వన భోజనం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జపురం పంచాయతీ బొంతుపేటలో శుక్రవారం బొంతు రామసత్యం మామిడితోటలో బొంతుపేట గ్రామస్తులు నిర్వహించిన కార్తీక సామూహిక వన భోజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జపురం, బోరపేట, ఆదపాక, సుబ్రద్రపురం, తాళ్లవలస, లావేరు, కేశవరాయపురం, గుమ్మాడం, గురుగుబిల్లి, సిగురుకొత్తపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు మూడువేల మందికిపైగా కార్తీక సామూహిక వనభోజనం కార్యక్రమంలో పాల్గొన్నరు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి మధుబాబు, పలువురు అధికారులు, అయ్యప్పస్వాములు, భవానీలు, ఉద్యోగులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నిర్వహకులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఆమదాలవలస : వృద్ధులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న చిన్ను



పొందూరు : రాపాకలో నిర్వహిస్తున్న అన్నదానం



బహుమతులు అందజేస్తున్న విప్ అశోక్

క్విజ్ పోటీల విజేత బొరివంక

ప్రజాశక్తి- కవిటి

కళింగసీమ కళాపీఠం ఆధ్వర్యంలో మండలంలోని ఇద్దివానిపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచి రూ.8వేలు నగదు బహుమతి, మెమెంటో అందుకుంది. అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో హరిపురం గీతం హైస్కూల్ ద్వితీయ స్థానంతో రూ.5 వేలు, హరిపురం జెడ్పి హైస్కూల్ తృతీయ స్థానంతో రూ.3 వేలు, ముత్యాలపేట జెడ్పిహెచ్ఎస్ చతుర్థ స్థానంతో వెయ్యి రూపాయల బహుమతి, మెమెంటోలు కైవసం చేసుకున్నాయి. విజేతలకు ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బహుమతులు అందించారు. బెల్లెడ లక్ష్మణమూర్తి మాస్టారు సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, హెచ్ఎం సంతోషి, ఉపాధ్యాయులు ఎస్.రాజబాబు, జి.రాంబాబు, జయరాం, రుంకు కృష్ణారావు, మొర్రి గోపి, శ్రీరామ్మూర్తి బిసాయి, జి.వంశీకృష్ణ, ప్రకాష్, బి.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చిన్మయ్

అధ్యాపకులకు అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుల కోసం కౌన్సిలింగ్, స్ట్రెస్-ఫ్రీ బోధనా అవగాహనా కార్యక్రమం నిర్వహించబడిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సుప్రీంకోర్ట్ ఆదేశాలతో, ఎఐసిటిఇ మార్గదర్శకాలు అనుసరించి నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వారణాసి చిన్మయ్ రిసోర్స్ పర్సన్‌గా, డా. ఆర్.శాంతికుమార్, డీన్ స్టూడెంట్ అఫైర్స్, కన్వీనర్‌గా వ్యవహరించారన్నారు. అతిథి చిన్మయ్ మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి లేకుండా బోధించే పద్ధతులు, తరగతి గదిలో సానుకూల వాతావరణం సృష్టించాల్సిన పద్ధతులు, విద్యార్థుల సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలి వంటి అంశాలతో పాటు, విద్యార్థులు బలవన్మరణాలు వంటి ఆలోచనల నుంచి బయటపడేందుకు అధ్యాపకులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎ.ఎస్.శ్రీనివాసరావు, విభాగాధిపతులు డా. రత్నమణి, డా. రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మత్స్యకారులు సమస్యలు పరిష్కారం కోరుతూ పాత బస్‌స్టాండ్ సమీపంలో మత్స్యకారులు మత్స్యకార దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సదర్భంగా తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పలు డిమాడ్లు వినిపించారు. వలసలు అరికట్టడానికి హార్బర్లు, జెట్టిలు, ల్యాండింగ్ సెంటర్లు మంజూరు చేయాలని, తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, చేపల వేటలో మరణించిన వారికి రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేయాలనికల్పించాలి. తీర ప్రాంత భూములు పైన సర్వహక్కులు చట్ట పరంగా కల్పించాలని, సముద్ర తీర ప్రాంతాలలో కాలుష్య పరిశ్రమలు, భావనములు నిర్మాణాలను ప్రభుత్వం రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని, ఆర్థికాభివద్దికై వలలు, తెప్పలు, బోట్లు, ఇంజన్లు, అయిల్, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికిలి ఆటోలు,మోటార్ వెహికల్స్ 90 సబ్సిడీ రాయితీ కల్పించి లోన్స్‌వివ్వాలని అన్నారు. మత్స్య కార నాయకులు చింతపల్లి సూర్యనారాయణ, మూగి గురుమూర్తి, మైలపల్లి నరసింహమూర్తి పాల్గొన్నా రు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పోలాకి

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం దీర్ఘాశి పంచాయతీ కింజరాపు వానిపేటలో రూ.29.30 లక్షలతో ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, సర్పంచ్ మెండ సుమంగళి, మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, సూరపు నారాయణ దాసు, చిట్టి సింహాచలం, మెండ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు అందేలా చర్యలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కోష్ట పంచాయతీ కోష్ట, పల్లెపేట, పైడిపేట, దువ్వానపేటలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీటి సరఫరా వెళ్లాలని, ఎక్కడా నీరు వృథా కాకుండా పని జరిగేలా చర్యలు చేపట్టాలని కూటమి నాయకులు అన్నారు. శుక్రవారం కోష్ట సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంచాయతీలో ఏ ఒక్క ఇంటికి తాగునీటి సమస్య లేకుండా చేయాలని తీర్మానం చేశారు సమావేశంలో టిడిపి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, స్థానిక సర్పంచ్ పిసిని హరిబాబు, ఎంపిటిసి పిసిని ఆసిరినాయుడు, మాజీ ఎంపిటిసి పైడి అప్పుడుదొర, యువ నాయకులు పిసిని హరికృష్ణ, పిసిని అప్పలనాయుడు, పి.చిన్నారావు, కరిమజ్జి రామారావు, కెల్లా గోవింద, పి. పాపి నాయుడు, పి.సూరిబాబు, పి.అప్పారావు, పల్లె సూరి, సెక్రటరీ శ్రీధర్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంపాదనలోంచి కొంత సేవకు



సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సంపాదనలోంచి కొంత సేవా కార్యక్రమాల కోసం ఉపయోగిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన రిలియబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. శుక్రవారం దేవునల్తాడ కూడలిలో ఉద్దనం అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరుపేదలకు, అనాధులకు, నిరాశ్రయాలకు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పేద విద్యార్థులను చేయుతనిచ్చే లక్ష్యంతో 2013లో ట్రస్టు ఏర్పాటు చేయబడిందన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో పలుచోట్ల కుష్టు రోగుల కోసం, అనాథల కోసం ఇప్పటివరకు 58 కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు, దుస్తులు, విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి బాధితుల అవస్థలు విని తమవంతు సహాయం చేయడానికి ముందుకొచ్చామని అన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 400 మందికి సుమారు రూ.6 లక్షలు విలువచేసే నిత్యావసర వస్తువులు, బియ్యం, చీర, దుప్పట్లను అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఈ ప్రాంతంలో ఉద్దానం సేవా సమితితో కలసి రిలియబుల్ ట్రస్ట్ సభ్యులు సహకారంతో తమవంతు సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్దానం అభ్యుదయ సేవాసమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు, తహశీల్దార్ డి. సీతా రామయ్య, ఎంపిడిఒ రమేష్ నాయుడు, టిడిపి నాయకులు అప్పోజి, గోవింద పాపారావు, అడ్ల రాజేష్, సర్పంచ్‌లు అట్టాడ గోపి, వరదరాజు, చింత రాజు, వంక రామారావు, గుళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



పోలాకి : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఎ కాలనీలో తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

ఆమదాలవలస : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు హనుమంతు నాగభూషణరావు, పివివికె రాజు, చౌదాల గోవిందరావు, టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్ యాదవ్, షేక్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం సిటీ : అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



చర్మవ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు ఆశా షేక్

చర్మ వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

నరసన్నపేట: పద్మావతి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ప్రత్యేక శిబిరానికి విశాఖపట్నానికి చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ ఆశా షేక్ హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో చర్మ సమస్యలు, వాటి నివారణపై అవగాహన కల్పించడానికి, ఉచిత వైద్య సేవలు అందించడానికి ఆమె తన బృందంతో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మవ్యాధులపై నిర్లక్ష్యం తగదని, శుభ్రత లోపం, సీజనల్ మార్పులు, సరైన ఆహారం లేకపోవడం వల్ల చాలా సమస్యలు వస్తాయన్నారు. సరైన సమయంలో వైద్యుడిని సంప్రదిస్తే చిన్న సమస్యలను కూడా సులువుగా నయం చేయవచ్చన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, నిమ్మాడ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్, వ్యాపారవేత్త నానాజీ, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మాకెన సతీష్, ఎన్ఎస్ ఎస్ పిఒ కె.రాము, అధ్యాపకులు పద్మనాభం, రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఉద్యమానికి లోటు

టెక్కలి: ఆదివాసీ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఆదివాసీ సంఘ నాయకులు జన్ని దండాసి మరణం ఉద్యమానికి తీరనిలోటని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి అన్నారు. శుక్రవారం జన్ని దండాసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాల్లో చేరుతూ గిరిజనులకు, వారి హక్కులను దుర్వినియోగం జరుగుతున్న సమయంలో దండాసి ముందుండి నకిలీ ధ్రువీకరణ పత్రాలను అడ్డుకున్నారన్నారు. ఆదివాసీలకు పోడు వ్యవసాయానికి పట్టాలు మంజూరు చేయడంలోను, మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంలో దండాసి చూపిన చొరవ నేటి ఉద్యమాలకు యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో హిరమండలం, జలుమూరు తహశీల్దార్‌లు జన్ని రామారావు, ప్రసాద్, సంఘ నాయకులు గేదెల శేషగిరి, పడాల మాదయ్య, చిన్నబాబు, జన్ని రవి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న నాయకులు

వసతిగృహాల సమస్యలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న నారాయణరావు

టెక్కలి: జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి వసతిగృహాల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు కోరారు. శుక్రవారం రాజధాని అమరావతిలో గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక వేలాది మంది విద్యార్థులున్నారన్నారు. వసతిగృహాల్లో ఆర్‌ఒ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు వినియోగం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ ఏర్పాటు చేసి ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అందించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని నారాయణ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో కొచ్చా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి- సోంపేట

ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు మంచి చెడులపై అవగాహన కల్పించాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై వ్యత్యాసాన్ని తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలని కొర్లాం బాపూజీ గ్రంథాలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం గొనకపాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.సుశీల, అధ్యాపక బృందం, రాంబుడ్డి గణపతి, పెద్దింటి చందు, రాంబుడ్డి గంగారావు, పెద్దింటి తారక్, రాంబుడ్డి యాదగిరి, సివంగి రాము, సివంగి సంతు, మాల్యాడ సీతయ్య, మల్లేన రమేష్ పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న ప్రతినిధులు

నాణ్యతతో పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని మునిసిపల్ కమీషనర్ ఇ.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పలాస లేబర్ కాలనీ నుంచి ప్రభుత్వ ఐటిఐ కళాశాల మీదుగా రూ.23.00 లక్షల అంచనా విలువతో 15వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రీకర్, కిరణ్ కుమార్, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎదురు కాల్పులపై న్యాయ విచారణ చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో వాహపక్షాల నాయకులు

ప్రజాశక్తి- పలాస

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో జరిగిన వరుస ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని వామపక్షాలు, ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌లో హెడ్మాతో సహా మొత్తం 13 మంది మావోయిస్టులు మరణించారని, అటవీ ప్రాంతంలో మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన తర్వాత పోలీసులు కాల్చి చంపారని అక్కడ ప్రజల్లో పలు అనుమానాలు, సందేహాలు ఉన్నాయన్నారు. వివిధ చోట్ల నిర్బంధించిన మావోయిస్టులను, వారి అనుయాయులను వెంటనే సంబంధిత న్యాయస్థానాల ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఇంతవరకూ అడవుల్లో దొరికిన వారిని అడవుల్లోనే ఎదురు కాల్పుల పేరిట పోలీసులు చంపుతున్నారని, ఇప్పుడు అడవుల నుంచి బయటకు వచ్చి పట్టణ, నగర ప్రాంతాల్లో తల దాచుకున్న వారిని పట్టుకుని అడవులకు తీసుకెళ్ళి ఎదురు కాల్పుల పేరిట కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. నయా ఫాసిస్ట్ నిర్బంధ విధానాన్ని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు, సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిల రామారావు, అమర వీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి కోదండరావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్, పిడిఎం రాష్ట్ర నాయకులు సాలిన వీరస్వామి, జుత్తు వీరాస్వామి, సవళాపురపు కృష్ణవేణి, సిఐటియు గణపతి, సవర బంగ్లా కుమార్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టివలసలో అత్మ పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం శ్రీకాకుళం 2025-26 సీజన్‌లో రబీలో అపరాలు, వేరుశెనగ, మొక్కజొన్న పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అలాగే అవే పంటల్లో కలుపు యాజమాన్యం, ఎరువులు యాజమాన్యం, తెగుళ్లపై తెలియజేశారు. రైతుల సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం చెప్పారు. కార్యక్రమంలో టెక్కలి ఎడిఒ కె. జగన్మోహన్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయాధికారి వై.సురేష్, మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు, విఎఎ సత్యరాజు, శ్రావణి, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బెల్లుపాడ గ్రామంలో ఆత్మ స్వౌజన్యం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన సదస్సు, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహనతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో రైతులకు మట్టి హెల్త్ కార్డులు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, విఎఎ మల్లేష్, ప్రజా ప్రతినిధులు, రెయ్య జానికిరామ్, కుర్మారావు రెడ్డి, గిన్ని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 19వ వార్డు పాత ఆమదాలవలసలోని రామ మందిరం వద్ద మెడికవర్ ఆస్పత్రి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జి పాగోటి మణికంఠ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ఇన్‌ఛార్జి మణికంఠ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కళాసీలు, కార్మికులు ఎక్కువగా నివసిస్తూ ఉంటారని వారందరిని దృష్టిలో పెట్టుకొని ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సౌమ్య మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మంది రోగులు పాల్గొన్నారని, వారికి బిపి, షుగర్, ఇసిజి, గుండె సంబంధిత వైద్యపరీక్షలను నిర్వహించి రోగులకు ఉచిత మందులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి కో-ఆర్డినేటర్ చిరంజీవి, టెక్నీషియన్ నీలవేణి, ప్రశాంతి, ఫార్మసిస్ట్ స్వాతి, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తంగి శంకర్, వార్డు నాయకులు బండి దివాకర్, అంబటి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

పిఎసిఎస్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో తేమశాతం, తూకాలను స్థానిక టెక్నికల్ అసిస్టెంట్ సాయంతో సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎం. వెంకట అప్పలనాయుడు, రోణంకి కృష్ణంనాయుడు, బైరి భాస్కరరావు, తమ్మినేని భూషణరావు, సిఇఒ బి.రాంబాబు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రవికుమార్, ఎఒ చిరంజీవి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి మేజర్ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎఎంసి చైర్మన్, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు టెక్కలిలో జగతిమెట్టు నుంచి చేరివీధి హనుమాన్ విగ్రహం వరకు పాత జాతీయ రహదారి సమగ్ర అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4.30 గంటలకు పాత, నూతన జాతీయ రహదారి కలుపుతూ అయ్యప్ప నగర్ నందు 40 అడుగుల సిసి రహదారి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఔషధ మొక్కల ప్రాధాన్యత తెలుసుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ఔషధ మొక్కలు ప్రాధాన్యత తెలుసుకోవాలిశ్రీతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. శుక్రువారం నరసన్నపేట డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు ప్రాధాన్యత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పూర్వీకులు వాడిన మొక్కల కోసం విద్యార్థులకు తెలిపారు. ఔషద మొక్కలు ప్రాధాన్యత వాటి విలువను, వైద్యంలో వాటి ఉపయోగం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాంతి హేమ, రవికుమార్, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో భవితకు భరోసా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధునికకాలంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని హెచ్ఎం భాస్కర్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడసంద్రలో ఫ్యూచర్ కెరీర్, కంప్యూటర్ స్కిల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫ్యూచర్ ఇంజినీర్ శిక్షణ పొందిన పాఠశాల ఉపాధ్యాయులు రామలక్ష్మి, ధర్మారావు విద్యార్థులకు ప్యానెల్ బోర్డు నందు ఎఐకు సంబంధించిన కృత్యాలను విద్యార్థులతో చేయించారు. అనంతరం హ్యూమన్ ఇంటెలిజెన్స్, మిషన్ ఇంటలిజెన్స్ మధ్య తేడాలను వివరించారు. కార్యక్రమంలో 6 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన విశాఖ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి- పొందూరు

భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక సమస్య తలెత్తి శుక్రవారం పొందూరు రైల్వేస్టేషన్‌లో సుమారు రెండున్నర గంటల పాటు నిలిచిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు పొందూరు చేరుకున్న రైలులో అలారం చైన్ పుల్లింగ్ కారణంగా నిలిచిపోయిందని, విజయనగరం నుంచి వచ్చిన సిబ్బంది సమస్యను పరిష్కరించడంతో 4.30 గంటలకు రైలు తిరిగి బయలుదేరి వెళ్లినట్లు స్టేషన్ మాస్టర్ జె.వి.ఉమామహేష్ తెలిపారు. పొందూరులో విశాఖ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో దిబ్రూగడ్ నుంచి కన్యాకుమారికి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్, శ్రీకాకుళం నుండి బెంగుళూరు వెళ్లే స్పెషల్ ట్రైన్, ఇఎంయు పాసింజర్ ట్రైన్లు ఆమదాలవలస (శ్రీకాకుళం రైల్వేస్టేషన్) సమీపంలో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సుమారు రెండున్నర గంటల పాటు విశాఖ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పనులను పరిశీలిస్తున్న బాబూరావు తదితరులు

సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపాలిటీ అత్యంత సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు ఆయన పర్యవేక్షించారు. ఆయనతో పాటు అట్టాడ షణ్ముఖ, అంపోలు శ్రీకాంత్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

ప్రజాశక్తి- నందిగాం

ఎపి విద్యా సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు స్థానిక గురుకులంలో శుక్రవారం సందర్శించారు. నాబార్డు నిధుల నుంచి రూ.కోటి 75 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలను పరిశీలించారు. అదనపు వసతులు, డార్మిటరీ మరమ్మతులు, విద్యుదీకరణ, ప్లంబింగ్, అవసరమని జిల్లా కోర్డినేటర్ వై.యశోదలక్ష్మి కోరారు. ఈ పాఠశాల, కళాశాలలో 300 మంది విద్యార్థినులు చదువుతున్నారన్నారు. మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్పొరేషన్ డిఇ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బి.మంజుల తదితరులున్నారు.



పరిశీలిస్తున్న పిఎంజె బాబు తదితరులు